క్లుప్తంగా

చిరుద్యోగులను తొలగిస్తే మూల్యం చెల్లించుకుంటారు

• సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి



ఏపీఎంతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి

జియ్యమ్మవలస: వీవోఏలు, ఉపాధిహామీ ఫీల్డ్అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, ఆశావర్కర్లను చిరుద్యోగులను టీడీపీ నాయకులు ఇష్టానుసారం తొలగింపులకు పాల్పడుతున్నట్లు సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం ఏపీఎం నాగభూషణ రావును కలిసి టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కొంత మంది వీవోఏలను తొలగిస్తూ ప్రజాప్రతినిధులు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. టీడీపీ నాయకులు అరాచక పాలన తగ్గించాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెపుతారన్నారు. ఎవరైనా ఉద్యోగి తప్పు చేసి ఉంటే తొలగించాలి, కానీ ఎటువంటి తప్పులేకుండా తొలగించడం అన్యాయమని అన్నారు. మహిళా సంఘ సభ్యుల మధ్య మగ వీవోఏలు ఉండకూడదని జీఓ ఉన్నా సీసీలు, ఏపీఎంలను కూడా మార్చాల్సిన అవసనం ఎంతైనా ఉందన్నారు. ఎవరినైతే విధుల నుంచి తొలగించారో వారందరినీ వారం రోజుల్లో విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొల్లి గంగునాయుడు, కె.సీతారాం, జి.శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతంపేట: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్కో ఏఈ జి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

వ్యాధుల సీజన్.. తస్మాత్

సీతంపేట: ప్రస్తుతం వ్యాధుల సీజన్ అని అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పూతికవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సీజన్లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఎటువంటి అజాగ్రత్త వహించవద్దన్నారు. కాచీ చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజనులకు పలు సూచనలిచ్చారు. గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాల మెనూ పరిశీలించారు. చదువులతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

భోజనం రుచికరంగా ఉండాలి

సీతంపేట: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వండి వడ్డించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు అన్నారు. కుశిమి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు పరిశీలించారు. ప్రతీ రోజు వండే భోజనం ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చదువులను పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బాగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం: కురుపాంలోని మహాత్మా జ్యోతీబా పూలే పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి, నేత్ర వైద్య సహాయకుడు రమేష్ విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. కంటి సంబంధిత వ్యాధులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యానారాయణ ఉన్నారు.

జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా మహిళలు వెలుగు ద్వారా అందజేస్తున్న రుణ ప్రోత్సాహాలను సద్వినియోగించుకొని జీవనోపాధులను మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం ఆదయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెలుగు సమాఖ్య ద్వారా డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీలు, ఉన్నతి, స్త్రీనిధి వంటి తొమ్మిది రకాల రుణాలను ఇవ్వడం జరుగుతుందని, వాటితో జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలని సూచించారు. అర్హులైన సభ్యులకు సకాలంలో రుణాలు అందజేసేలా వెలుగు సమాఖ్య అధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో విరివిగా డ్వాక్రా సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ.. సంఘాల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, వెంపటాపు భారతి, తాడంగి లక్ష్మణరావు, సమాఖ్య అధ్యక్షులు కిల్లక చిలకమ్మ, కార్యదర్శి నిమ్మక ఊర్వశి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు వేళాయె..

• 8న అన్ని పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణ
• అదేరోజు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, తొలి సమావేశం
• విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరికి ఓటు వేసే అవకాశం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతుల పర్యవేక్షణతో పాటు విద్యార్థులకు నాణ్యమైన బోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర అంశాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఎస్ఎంసీ కమిటీ ఎన్నికకు సంబంధించి ఈ నెల 1న విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 8న అన్ని పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు హెచ్ఎంలు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 55 ఉన్నాయి. వాటిలో 3,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయనున్నారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా..

పాఠశాలల్లోని నోటీస్ బోర్డుల్లో ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించారు. ఈనెల 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికలకు కనీసం 50శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరు తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరైనా ఒకరికే ఓటు హక్కు ఉంటుంది. చేతులెత్తే విధానంలో మద్దతు తెలపడం ద్వారా కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల అభ్యర్థన మేరకు రహస్య ఓటింగ్‌ను నిర్వహిస్తారు. ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అనంతరం ప్రమాణ స్వీకారం నిర్వహించి కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికల ప్రక్రియలో తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓలు పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

సభ్యుల ఎన్నిక ఇలా...

ప్రతీ తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. ఇందులో కనీసం ఒక మహిళ ఉండాలి. మిగిలిన ఇద్దరిలో ఒకరు ఎస్సీ/ఎస్టీ/పీహెచ్‌సీ కేటగిరీకి చెందిన వారు, ఇంకొకరు బీసీ/ఈబీసీ/మైనార్టీ వర్గాలకు చెందిన వారై ఉండాలి. కమిటీకి ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు. వారిలో హెచ్ఎం మహిళా ఉపాధ్యాయురాలు, వార్డు మెంబర్, అంగన్‌వాడీ టీచర్, గ్రామైక సంఘం అధ్యక్షులు ఉంటారు.

నిబంధనల ప్రకారం ఎన్నికలు



ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ ప్రదర్శించాం. ఎన్నికల షెడ్యూల్, ఎన్నికల ప్రక్రియ విధానం వివరాలను ప్రకటించాం. 8వ తేదీన ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. తల్లిదండ్రుల సహకారంతో నిబంధనల ప్రకారం ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహిస్తాం.

– ఎంఈఓ నాగభూషణరావు

తల్లిపాలు అమృతం



సీతంపేట: తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సీతంపేట: తల్లిపాలు అమృతం వంటివని ఎంపీడీఓ గీతాంజలి, ఐసీడీఎస్ సీడీపీఓ పి.రంగలక్ష్మి అన్నారు. కుశిమి పీహెచ్‌సీ, పెదరామ గ్రామాల్లో తల్లి పాల వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. తల్లిపాలు విశిష్టతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. సూపర్‌వైజర్లు లవాణ్య, గౌరి, వైద్యాధికారులు రవీంద్ర, చాందిని తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే ఆరోగ్యం

భామిని: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ప్రత్యేకాహ్వానితులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. మనుమకొండలో ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ పత్తిక మురళీ, తల్లులు పాల్గొన్నారు. బిల్లుమడ, నులకజోడులలో ఐసీడీఎస్ ఎస్‌ఓలు జ్యోతిలక్ష్మి, సబితా పట్నాయిక్‌ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు.



భామిని: మనుమకొండలో తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలలో ఔషధ గుణాలు

వీరఘట్టం: తల్లి పాలలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయని ఐసీడీఎస్ పీఓ సిమ్మాలమ్మ తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తలవరం, బొడ్లపాడుతో పాటు వీరఘట్టంలోని పలు కేంద్రాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ, అంగన్‌వాడీలు, హెల్త్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు పొగాకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాంకు చెందిన న్యాయవాది (న్యాయ సేవా కమిటీ సభ్యుడు) బరాటం చంద్రమౌళి అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'నో టొబాకో'.. 'డ్రగ్ ఫ్రీ' కార్యక్రమలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసైతే జీవితం నాశనమవుతుందన్నారు. డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడితే చట్టప్రకారం ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది చంద్రమౌళి

కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు కల్పన, శ్రీవాణి, తులసి, శాంత, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

• డీఈఓ పగడాలమ్మ

పాలకొండ రూరల్: పాఠశాల కమిటీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పగడాలమ్మ అన్నారు. ఈనెల 8వ తేదీన మండల పరిధిలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు, విద్యార్థుల తల్లితండ్రుల సంఖ్య, సమస్యాత్మక ప్రాంతాలపై ఎంఈఓ కె.సోంబాబును ఆరా తీశారు. అవసరమైన చోట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మండల రిసోర్స్ కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఈ క్రమంలో ఇందిరాగనర్ కాలనీ, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మండలంలోని భాసూరు పాఠశాలలను సందర్శించారు. అక్కడ మధ్యాహ్న భోజన నిర్వహణ తీరు, విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబడుతున్న డీఈఓ పగడాలమ్మ

అభివృద్ధి, సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దాం..

• ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేద్దామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని దురుబిల్లి గ్రామంలో యస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆదివాసీ హక్కులు–అవకాశాలు' అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదివాసీలను చైతన్యవంతం చేసేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. యస్ సొసైటీ కార్యదర్శి ఎస్.కే గౌస్, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, జనసేన నాయకులు కె.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం నీలకంఠాపురంలో ఈ నెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గిరిజన సంఘాల నాయకులు ఆహ్వానం అందజేశారు. గిరిజనులంతా ఐక్యంగా నిర్వహించుకునే ఈ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ద్వారా గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిచెపుదామని ఆమె వారితో అన్నారు.



గిరిజన సంప్రదాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

భామినిలో భారీ వర్షం

భామిని: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో కురిసిన వర్షం సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. దమ్ము పట్టేందుకు ఈ వర్షం చాలా అనుకూలిస్తుందని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ బోర్లు ఉన్న చోట వరినాట్లు సాగుతున్నాయి. ఈ వర్షం వర్షాధార భూముల్లో కూడా నాట్లుకు అనుకూలిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పాలకొండలో..

పాలకొండ: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరినాట్లు ఎండిపోతున్న తరుణంలో కురిసిన వర్షం అన్నదాతకు ఊరటనిచ్చింది.

గిరిజన యువతకు శిక్షణ

సీతంపేట: గిరిజన యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు త్వరలో ఇవ్వనున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వారి నుంచి సమాచారం సేకరించనున్నామన్నారు. దీనిలో భాగంగా క్యూఆర్ కోడ్‌ను రూపొందించామన్నారు. దీనిలో వారి వివరాలు, వారికి నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ ఐటీడీఏ సీతంపేట, ఏపీ గవ్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వైటీసీ మేనేజరు 7032060773 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రోగులకు సత్వరం చికిత్స అందించాలి

• డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

కొమరాడ: ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రం కాకుండా అరికట్టవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. లీగల్ సర్వీస్ కమిటీ సూచనల మేరకు కొమరాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన మందులు, వైద్య పరికరాలను పరిశీలించారు. ఆరోగ్య తనిఖీల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ జ్వరాలు, వ్యాధులతో బాధపడుతున్న వారికి నిర్వహించిన రక్త పరీక్షలు, అందజేసిన చికిత్సపై వైద్యాధికారిని అడిగారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో తరచుగా పర్యవేక్షిస్తూ సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించి సత్వరమే వైద్య పరీక్షలు చేపట్టి, మందులు అందజేయాలని సూచించారు. అనంతరం కేఆర్బీపురంలో పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో పాల్గొని క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఎంపీడీఓ ఎం.మల్లికార్జునరావు,వైద్యాధికారులు పాల్గొన్నారు.

చిక్కీలు, గుడ్లు పాఠశాలలకు అందించాలి

జియ్యమ్మవలస: ఈనెల 8న జరగనున్న ఎస్ఎంసీ ఎన్నికలను సజావుగా జరిగేలా చూడాలని ఎంఈఓ–1 నాగభూషణరావు, ఎంఈఓ–2 శ్రీనివాసరావు హెచ్ఎంలకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దని సూచించారు.



ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

చిక్కీలు, రైస్ అప్పగించాలి

విద్యార్థులకు ఇస్తున్న చిక్కీలు, గుడ్లు పాఠశాలలకు వచ్చి అందివ్వాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు గుండ్రెడ్డి శ్రీనివాసరావు, తలగాపు శ్రీనివాసరావు, పి.రంగయ్య, శశికుమార్ ఎంఈవోలకు వినతిపత్రం అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్‌కు వచ్చి ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ గుర్తింపు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ(ఎన్ఏసీ) నాక్ గుర్తింపు దక్కడం శుభపరిణామమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాలలో సహచర అధ్యాపకులు, ఉపన్యాసకుడు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక కళాశాలలో ఇటీవల రెండు రోజులు పర్యటించిన నాక్ బృందం సభ్యులు ఇక్కడి బోధనా ప్రమాణాలు, పరిశోధన అంశాలు, ఫలితాలు, పరిపాలన విధానం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం నాక్ బృందాలు ప్లస్ బీ గుర్తింపు కళాశాలకు ఇచ్చినట్టు తెలిపారు. దీని కాల పరిమితి ఐదేళ్లు ఉంటుందన్నారు. ఎస్ఆర్‌సీ పరిధిలో ఈ గ్రేడ్ సాధించిన ఏకైక కళాశాల మనదే అన్నారు. ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో నాక్ సహకారంతో కళాశాల మరింత పురోగతి సాధించేలా సమష్టిగా కృషి చేద్దామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూ కో ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నాక్ అందించిన ప్లస్ బీ గుర్తింపుపై సహచరులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

14న మెగా రక్తదాన శిబిరం

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 14న మెగా రక్తదానం శిబిరం నిర్వహించనున్నట్టు ఎన్జీఓ సంఘ నాయకుడు లిల్లీ పుష్పనాథం అన్నారు. ఎంపీడీఓ ఎస్.రామకృష్ణను మంగళవారం కలిసిన ఆయన అధికారిక సహకారం అందించాలని కోరారు. జిల్లాలో అవసరం మేరకు రక్త నిల్వలు లేని క్రమంలో కలెక్టర్ పిలుపు మేరకు శిబిరం నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎన్జీఓ సభ్యులు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా శాఖాపరంగా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తామన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు, ఎన్ఎస్ఎస్ పీఓ బి.రాజు ఉన్నారు.



ఎంపీడీఓతో చర్చిస్తున్న ఎన్జీఓ సంఘాల నాయకులు

మానసిక రుగ్మతలపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: విద్యార్థులు మానసిక రుగ్మతలపై అవగాహన పెంచుకుని వాటిని అధిగమించాలని డీఎంహెచ్ఓ విజయపార్వతి అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆమె పాలకొండలోని గాయత్రి ఒకేషనల్ కళాశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రముఖ సైక్రియాట్రీ సోషల్ వర్కర్ కె,కృష్ణారావు పలు మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ తరహా ఆరోగ్య సమస్యలకు మందులు అందుబాటులో ఉన్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించి సలహాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డీఈఎంఓ వై.యోగేశ్వర రెడ్డి, ఎస్ఏహెచ్ఎం ఏఓ సాల్మన్‌రాజ్, ఎన్‌టీసీపీ కె.భవాని కళాశాల సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పాలకొండ రూరల్: అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీ) కె.రత్నకుమారి అన్నారు. తన కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులకు సహ చట్టంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ కార్యాలయ పౌర సమాచార అధికారి కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. సహ చట్టం ఆవశ్యత, అర్జీదారుల ప్రశ్నలకు సమాధానం అందించే విధానం, చట్టంలో పొందుపర్చిన సెక్షన్లపై కూలంకుషంగా వివరించారు.



సహ చట్టంపై వ్యవసాయాధికారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు, ఏడీ

నేర ప్రవృత్తిని విడనాడాలి

పాలకొండ రూరల్: సమాజంలో ఉండే ఏ ఒక్కరైనా నేర ప్రవృతిని కలిగి ఉండకూడదని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ సబ్‌జైల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇటీవ అమల్లోకి తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ చట్టాల ప్రాప్తికి నేరం చేసిన వ్యారు ఏ స్థాయిలో ఉన్నా కఠినమైన శిక్షలు తప్పవన్నారు. నేరం వృత్తిగా చేసుకోవద్దని, సత్ప్రవర్తనతో సమాజంలో గొప్ప స్థానం పొందవచ్చని సూచించారు. ఆయన వెంట జైల్ సూపరింటెండెంట్ బి.జోగులు, న్యాయవాది ఎం.వి.వెంకటేశ్వరులు, హెడ్ వార్డర్ బి.విజయ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, వారికి కల్పిస్తున్న వసతులు, న్యాయపరమైన తోడ్పాటుపై నేరుగా అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

సంపూర్ణ అభియాన్‌కు సహకారం అవసరం

భామిని: నీతి అయోగ్ పర్యవేక్షణలో అమలు చేస్తున్న ఏస్పరేషన్ డిస్ట్రిక్ట్ అండ్ బ్లాక్ అభివృద్ధికి అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ కార్యక్రమం అమలుకు పెరుమాళ్ ఫౌండేషన్ సహకరిస్తుందని ప్రాజెక్టు మేనేజర్ నారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏస్పరేషన్ బ్లాక్ అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావహ కార్యక్రమాల డెవలప్‌మెంట్‌కు చేపట్టనున్న ఆరు అంశాల అమలు కార్యాచరణ వివరించారు. సమావేశంలో ఏస్పరేషన్ కో ఆర్డినేటర మహేష్, పెరుమాళ్ ప్రాజెక్టు లీడ్ డాక్టర్ రమణయ్య, పెలోష్ అభిషేక్, గంగూళి మాట్లాడారు. ఈఓపీఆర్‌డీ జి.కృష్ణారావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఎం నారాయణరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని విజయరామరాజు వృత్తి విద్యా కళాశాల విద్యార్థులకు వాహనాలు నడిపేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంవీఐ సత్యానారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఆదేశాల మేరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్, ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. యువత ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.మోహనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ సత్యనారాయణ